# బతుకు బడి

## యువ వికాసం వ్యాసాలు



కె.బి.గోపాలం

Creative Links
PUBLICATIONS

# Batuku Badi

Yuva Vikaasam Vyaasaalu

**K.B.Gopalam**
vijayagopalk@gmail.com

K.B.Gopalam asserts the moral right to be identified
As the author of the work

© Writer

*Artwork on the Cover Page :* **K. Swathy**

*Cover Design & Layout :* **AVM Graphics**

First published in India in June 2016.

Copies : 1000

*Published by :*
**CREATIVE LINKS PUBLICATIONS**
1-8-725/A/1, 103C, Balaji Bhagyanagar Apartments,
Nallakunta, Hyderabad - 500044.
Ph: 9848065658, 9848506964.

*For Copies :*
**ALL LEADING BOOK STORES**

Rs. **250/-**



# రిలాక్స్ ప్లీజ్...

దేశ రాజధాని కొత్త ఢిల్లీలో ఆటో నడుపుతున్న ఒకతను ఏదో మాట్లాడుతూ టెన్షన్! అన్నాడు. ఆటో నడపడంలో కష్టం ఏమిటి? ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లడం, మామూలుగానే ఎక్కువ డబ్బులు తీసుకోవడం అనుకుంటున్న నాకు, ఒక్క క్షణం ఆశ్చర్యమయింది. కానీ, ఆలోచించి చూస్తే ఆటో నడపడంలో ఉండే చిక్కులు, ఒక్కొక్కటే అర్థమయినాయి! అవును గదా! టెన్షన్! అనుకున్నాను. ఢిల్లీలో టెన్షన్ అందరికీ ఒక ఊతపదంగా ఉంటుందంటే నమ్మండి.

ఈ భూప్రపంచంమీద, ఆకర్షణలు, ఒత్తిడులు, టెన్షన్‌లు (భౌతికపర మయినవి) వాటి వాటి స్థితిలో ఉండకపోతే, మనమంతా గాల్లోకి ఎగిరిపోతాము. బెలూనులాగా పేలిపోతాము.

అవే ఆకర్షణలు, ఒత్తిడులు, టెన్షన్‌లు మనసులోనూ ఉంటున్నాయి. వాటిని పెంచి పోషించి మనమంతా, నానా బాధలు పడుతున్నాము. అతనా! తొందరపడడమా? ఎప్పుడయినా చూచారా? అని నా గురించి మరెవరో అంటే, నాకు టెన్షన్ పట్టుకుంది ఒకసారి!

సమస్యలు లేకుంటే అది బతుకే గాదు. సీత, పీతల కష్టాలు తెలుసు గదా! సమస్యల గురించి కాదు ఆలోచించవలసింది. ముందుగా సమాధానాల గురించి పట్టించుకోవాలి.

గాలిలో మేడలు కట్టవద్దు. పేకమేడలు అంతకన్నా వద్దు. సమస్య గురించీ, సమాధానం గురించీ, చాలా వాస్తవికంగా ఆలోచించగలగాలి. చాలాసార్లు సమస్య, సమాధానం మన చేతుల్లో లేవని తెలుస్తుంది. అలాగని చేతులెత్తేయడం పద్ధతి కాదు. మనవంతుగా, ఏం చేయగలుగుతామో అది చేయాలి. ఫలితాలు తప్పకుండా వస్తాయి.

మన టెన్షన్‌కు మనమే పూర్తిగా బాధ్యులము అన్న సంగతి ప్రతిక్షణం గుర్తుంచుకోవాలి. అది అర్థమయింది గదా, అని, సమస్యను అమాంతంగా ఎత్తి మరెవరి నెత్తినో పెట్టడం వీలుగాదు. తీసి కింద పడేయడం కూడా వీలుగాదు. ఆ విషయంగా మనం చేసే మార్పులు, ప్రాక్టికల్‌గా చిన్నవిగా, ఒక క్రమంలో ఉండాలి!

అసలు ముందు సమస్య గురించి మనకు అర్థమయిందా? తర్వాత మనం చేయదలుచుకున్నది ఏమిటి? ఈ రెండు సంగతులను మనం బాగా గుర్తించాలి. వాటిని గట్టిగా గుర్తుంచుకుని కార్యరంగంలోకి దిగాలి!

క్షణాల్లో ఏదో జరగాలి, జరుగుతుంది అనుకోవడం తప్పు! అసలు నావల్ల ఏమీ అయ్యేట్లు లేదు అనుకుంటే, మనమిక ముందుకు ఒక అడుగుకూడా వేయలేము. ప్రయాణం ఎంత దూరమయినా, ఒకడుగు ముందుకు వేస్తేగానీ, అది ప్రారంభం కాదు. మనమూ మనుషులమే. అందరూ పరుగుపెడుతూ వెళ్లిపోతున్నారనీ, మనం ఇక్కడే ఉండిపోతున్నామనీ అనిపించడం సహజం! ఎక్కడా నిలబడి, ఉండిపోనంతకాలం, మనమూ ఏదో సాధిస్తూనే ఉంటాం!

ఏమీ జరగడంలేదు అనిపించిందా? ఏదో జరిగే ఉంటుంది. చేయలేక పోయిన విషయాలకన్నా, సాధించగలిగిన సంగతులను గురించి ఆలోచించడం మంచిది. ఉత్సాహం పెంచుకుని, జరగవలసిన సంగతులను గురించి ఆలోచిద్దాం!

మనల్ని ఎవరూ మెచ్చుకోరు! ఫరవాలేదు! మనల్ని ముందు మనం గుర్తించి మెచ్చుకుంటే, మరొకరి మెప్పుకోలు, తప్పక వస్తుంది!

అంతవరకూ... నో టెన్షన్! ప్లీజ్!

## ఉచితంగా... ఓ సలహా!

మిమ్మల్ని ఎవరయినా సలహాలడిగారా? మీరు సలహాలిస్తుంటారా? ఒక్కక్షణం ఆలోచించండి!

సలహా అడుగుతున్నవాళ్లు నిజానికి సలహా అడగరు. వాళ్ల నిర్ణయం వాళ్లు చేసుకునే ఉంటారు. వాళ్ల బాధాగాథను మీరు వింటే చాలు!

వాళ్లకు కావాల్సింది ఓదార్పు. మీరున్నారన్న భావం చాలు! వారికి మీరొక సర్టిఫికేట్ ఇవ్వాలి. నీవనుకున్నది బాగుంది అంటే చాలు! వాళ్లు మీకు దగ్గరగా వచ్చిన భావం కోసం వస్తారు. మనసులోని భయాలు, బాధలు, మీ ముందు పరిస్తే మీరు భుజం చుట్టూ చేయివేసి వారిని దగ్గరగా తీసుకుంటే చాలు.

వాళ్ల మాట సరయిందని మీరు అనాలి! వాళ్లలో లోపాలున్నా, బలహీనత ఉన్నా, వాళ్ల మాటలను మీరు పట్టించుకుంటారన్న నమ్మకం చాలు!

వాళ్లకు బాధ చెప్పుకోవడానికి మరెవరూ కనిపించి ఉండరు. మీరే వారికి చివరి ఆశ. మీ మాట అక్కడ కిటుకవుతుంది. మీరేమీ చెప్పనవసరం లేదు. వాళ్ల నిర్ణయం వాళ్లే చేసుకుంటారు. మీరు పక్కన ఉంటే చాలు!

చర్చకు వచ్చిన సత్యాలు, సమాచారాలను తరచి చూడాలి. ఒత్తిడితో ఉన్న వారు సాధారణంగా నిజాలను గుర్తించలేకపోతారు. ఆ పరిస్థితుల్లో మీరు అండగా ఉంటే చాలు!

### వోస్... ఇంతేనా!

*విన్స్టన్ వార్డ్ చాలా కష్టపడి ఒక నివేదిక రాసి కిస్సింజర్‌కు పంపించాడు. 'దీన్ని మరింత మెరుగుపరచడం వీలుపడదా?' అన్న ప్రశ్నతో నివేదిక తిరిగి వచ్చింది.*

*వార్డ్ మరింత కృషిచేసి నివేదికను తిరగరాసి పంపాడు.*

*మళ్లీ అదే కామెంట్‌తో నివేదిక తిరిగి వచ్చింది.*

*మరోసారి వార్డ్ నివేదికను తిరగరాశాడు.*

*మూడవసారీ అదే కామెంట్.*

*'నో! ఇక నావల్లగాదు!' అన్నాడు వార్డ్*

*'అయితే ఈసారి నివేదికను నేను చదువుతా!' అన్నాడు కిస్సింజర్*

నిర్ణయాల బాధ్యత మీరు తీసుకోవాలి! ఈ నిర్ణయం నాది కాదు! అని వారు తమ బరువును దించుకునేందుకు సాయం చేస్తే చాలు! ఎవరికో సమస్య ఉంటే, మీరు సలహాలిచ్చారు. మీకు సమస్య ఎదురయితే ఎవరు సలహా ఇస్తారు! ఇదొక చక్రం! గుర్తుంచుకోండి.

## మార్పు అవసరమా?

- నేను పరిపూర్ణ మానవుడను, అంటే నిండు మనిషిని! నాలో ఏ లోపమూ లేదు.. నేను పరిశుద్ధ వ్యక్తిని, ప్రశాంత వ్యక్తిని.. నాలో లొసుగులే లేవు.. నేనిట్లా ఉన్నంత కాలం నాలో ఏ మార్పు అవసరం లేదు.. కానీ, నన్ను మీరు, నా మనసు ఆధారంగా గుర్తించేట్లయితే, నేను నా మనసు ప్రకారం బతుకుతుంటే, నాలో మరింత పరిపూర్ణత రావాలని నాకే అనిపిస్తుంది. నేను మారాలి మరి!
- మనలను మనం గుర్తించుకోగలిగితే మనలో మార్పు అవసరం తెలుస్తుంది. మీరు మారాలి అంటూ అన్ని వేపులనుంచీ మనకు బోధనలు, సూచనలు అందుతున్నాయి ఈ మధ్యన. శిక్షణ తరగతులు, పుస్తకాలు, ప్రసంగాలు ఎన్నో మనలను మారమంటున్నాయి.
- వీటన్నిటితో మార్పు రావచ్చు. కానీ ఆ మార్పు నిజం కాదు. తిరుగులేనిది కాదు. మనలో లేని అంశాలను, మనలోనికి పంపడానికి ప్రయత్నాలవి. అంటే మనలో మార్పు కాదు. అది మన గుర్తింపుకు మార్పు అనవచ్చు.
- మార్పు లోపలినుంచి రావాలి. మనలను మనం గుర్తించగలిగి, 'ఇక్కడ మరేదో అవసరంఉంది' అన్న భావన మనకు కలగాలి.
- అప్పుడు ఈ బాగుపడడం అనే కార్యక్రమం అందుకు హంగులుగా, శిక్షణ, పుస్తకాలు, ప్రబోధాలు రంగంలోకి వస్తాయి. మార్పులో అది ఒక భాగం మాత్రమే. మనం మారడానికి సిద్ధం కావాలి. అది అసలయిన మార్పు!



### నిజమైన చిత్రం

నువ్వు నిద్రలేచినా
లేవకున్నా తెల్లవారడం
మాత్రం ఖాయం

-జాన్ చియార్డీ

మనం లేకపోతే ఈ
ప్రపంచం
ఏమయిపోతుందో
అనుకోవడం మనకు
అలవాటయింది. మనం
లేకున్నా ప్రపంచం
కొనసాగుతూనే ఉంటుంది.
అందుకే మనమున్నందుకు
ఏదో ఒక తేడా
చూపించాలి.



## అదీ కళే!

ఎపిక్టెటస్ మొదటి శతాబ్దిలో రోమ్ నగరంలో వెట్టి పని చేశాడు. తరువాత విముక్తి పొందాడు. తన చుట్టు చేరిన వారికి తత్త్వం గురించి బోధించేవాడు.

ఒకతను ఆయన దగ్గరకు వచ్చి 'అయ్యా! మీ మాటలను వినాలని ఎన్నోసార్లు వచ్చాను. ఫలితం అందలేదు. దయచేసి ఏమయినా చెప్పండి' అని అడిగాడు.

'మాట్లాడడమంటే, అన్ని పనులలాగే అంత సులభం అనుకున్నావా? ఆ మాటలు సరిగా ఉండాలి. ఎదుటివారికి పనికిరావాలి కదా!' అన్నాడు ఎపిక్టెటస్.

'అవున'న్నాడు ఆగంతకుడు.

'అందరూ విన్న విషయాలతో లాభం పొందుతారా? లేక కొందరేనా? మాట్లాడడం ఎంతటి కళనో, వినడమూ అంతే కళగా తోస్తుంది నాకు. ఒక విగ్రహానికి ☞

# మీరు ఎటు వైపు?

చాలాసార్లు మనం కొన్ని విషయాలను గురించి ఇది ఇలా ఉంటే ఎంత బాగుంటుంది అనుకుంటాము. కొందరు మాత్రం అలా ఉంటే, ఉండే పరిస్థితిని కలలుగంటూ ఊహాగానాలు, పథకాలు మొదలు పెడతారు. అలాంటి వారిని భావిజీవులు అనవచ్చు. మరోకోవకు చెందిన వారయితే భవిష్యత్తు మీకొక స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్తులోని అంశాలను సినిమాలాగా మీరు మనోఫలకం మీద చూడగలుగుతారు. ఆ రేపటి రూపం మిమ్మల్ని బలంగా ముందుకు కదిలేలా చేస్తుంది. కనిపించే చిత్రంలో, అంటే మీ భవిష్యత్తులో ఏముంటుంది? అన్న వివరాలు మీ శక్తి యుక్తుల మీద ఆధారపడతాయి. ఊరికే కలలుగంటే కుదరదు. మీకున్న బలమేమిటి? ఆసక్తి ఎంత? అనే ప్రశ్నలను ముందుగా గుర్తుంచుకోవాలి. ఆలోచన ఆచరణగా మారాలి. అప్పుడే అనుకున్న మంచి ప్రపంచం, మంచి జీవితం, మంచి మనుషులు, మంచి హంగులు సమకూరే వీలు ఉంటుంది. భావి జీవిని ఈ హంగులన్నీ ముందుకు కదిలిస్తాయి. కనుకనే అవన్నీ సమకూరుతాయి. కూడా!

రానున్న కాలం గురించిన కలలకన్నా, కావలసిన పరిస్థితుల గురించి వివరాలతో సహా ఒక దృష్టి ఉండడం అవసరం. అప్పుడు ప్రస్తుత పరిస్థితులు ఏ మాత్రం బాగులేక పోయినా సరే ఫరవాలేదు. తోడుగా ఉండవలసిన వాళ్ళు ఎంత నిరాశపరులు అ..! ఏముందిలే! అనే వాళ్ళూ అయినా ఫరవాలేదు. మీరు మాత్రం మీ భవిష్యత్తు గురించిన వివరాలను చూడగలుగుతారు. ఆ వివరాలే మిమ్మల్ని ముందుకు నడిపిస్తాయి. మీ ఉత్సాహం, పట్టుదల మరింత మందికి ఉత్సాహాన్ని, పట్టుదలనూ పంచగలుగుతుంది.

**అంటు వ్యాధులకన్నా సులభంగా ఇతరులకు సోకే శక్తి ఉత్సాహానికి ఉంది:** మిగతా వాళ్ళంతా మీరు కలగన్న వివరాలను వినాలని ముందుకు వస్తారు. అందరికీ ఆలోచనలు రావు! హద్దులను మరింత ముందుకు నెట్టడం అందరికీ చేతగాదు. మీ ఆశలతో ఒక చిక్కుంది. మీరు వాటిని సులభంగా సాధించగలరు. ఆ తర్వాత మరేమీ లేదనుకుంటారు! అదే చిక్కు! అంటారొక పెద్ద మనిషి.

భవిష్యత్తు గురించిన మీ చిత్రాన్ని మరింత మందికి మీరు చూపించగలిగాలి. ఆ వివరాలను వర్ణించి చెప్పే శక్తి మీలో ఉండాలి. మీ నమ్మకం, ఉత్సాహం మరింత మందికి అంటుతుంది.

ఆపని వీలు కాదంటే నేను నమ్మలేను. అయితే ఆ పని ఇదివరకు ఎవరూ చేసి ఉండకపోవచ్చు. మనం ప్రయత్నించి చూస్తే పోతుంది అనగలిగి ఉండాలి.

ఒక పనిని గురించి అదికష్టం, కనుక అసాధ్యం అనడం ఒక పద్ధతి. అదే పని గురించి అది కష్టం కావచ్చు. కానీ అసాధ్యమని ఇప్పుడే అనడంలో అర్థం లేదు! అనడం భావిజీవి పద్ధతి! అటో, ఇటో తేల్చుకోవాలి. ఒకచోట ఉండి పోకూడదు. ఏదో ఒక వేపు కదలాలి! ఎటు కదలుతారు? భావిజీవితం వైపే కదూ...

*రూపు పోయాలంటే నైపుణ్యం ఉండాలి. ఆ విగ్రహాన్ని సరిగా చూచి ఆనందించడానికీ నైపుణ్యం ఉండాలి మరి!' అన్నాడు ఎపిక్టెటస్ జవాబుగా!*

**-గోల్డెన్ సేయింగ్స్ ఆఫ్ ఎపిక్టెటస్ నుంచి**

## అందరూ గెలవాలి

అమెరికాలోని మరీన్ కౌంటీ, శాన్‌ఫ్రాన్సిస్కో నగరాల మధ్యన, గోల్డెన్ గేట్ అనే వంతెన నిర్మించారు. వంతెన నిర్మాణం ముగిస్తే ప్రయాణాలు సులభంగా జరుగుతాయని రెండు వేపులవారూ ఎదురు చూశారు. మరో రెండు వర్గాలు కూడా వంతెన నిర్మాణంలో ఆసక్తి కనబరిచారు. వంతెన నిర్మాణంలో పనిచేస్తున్నవారు ఒక వర్గమయితే, వారిలో ఎవరయినా ప్రమాదానికి గురయి చనిపోతే, ఆ చోట తమకు పని దొరుకుతుందని వేచి చూసిన వారు మరో వర్గం! ఈ రెండవ వర్గంవారి ఎదురు చూపులు సులభంగానే ఫలించినట్లున్నాయి. గోల్డెన్ గేట్ వంతెన మొదటి దఫా నిర్మాణంలో భద్రత ఏర్పాట్లు ఏవీ చేసినట్లు కనబడదు. కనుక ఇరవై ముగ్గురు పనివారు ప్రమాదవశాత్తు పడిపోయి మరణించారు. చివరకు తేరుకున్న అధికారులు లక్ష డాలర్ల ఖర్చుతో వంతెన కింద ఒక పెద్ద వలను ఏర్పాటు చేశారు. ఆ వల కారణంగా కనీసం పదిమంది ప్రాణాలు నిలిచాయి. 24 శాతం పని ఎక్కువ జరిగినట్లు కూడా లెక్క తేలింది. అది వల ఖరీదుకన్నా ఎన్నో రెట్లని కూడా లెక్కవేశారు. ఎవరో చనిపోవాలని చూసిన వారికి తప్ప, అందరికీ సంతృప్తి కలిగింది. అనుకున్నదానికన్నా తక్కువ ఖర్చుతో వంతెన తయారైంది. పనివాళ్లూ బాగా పనిచేసి జీవనం సాగించగలిగారు!

## నిర్మొహమాటంగా..

మంచివారు అనిపించుకోవాలంటే, ఎవరు ఏం చెప్పినా అవును అనాలని కొందరు అనుకుంటారు. కాదు, లేదు అని జవాబు చెప్పవలసిన ప్రశ్నలకు ఆ రకంగా చెప్పడం మొరటుతనమని కూడా చాలామందికి అభిప్రాయం ఉంటుంది.



**అసలుమాట**

*అసలయిన తెలివి ఊరికే ఉండదు. అది అమలులోకి వస్తుంది. అమలు ఒక పద్ధతిలో జరిగితే తెలివి బయట పడుతుంది. ఈ రెండూ వేరుకావు.*

• • •

***భయం...***

*పడిపోతామని,*
*విఫలులవుతామని,*
*దొరికిపోతామని*
*భయపడుతూ బతుకుతుంటే*

*ఆ బతుకు మోయలేని బరువవుతుంది.*

ఇంట్లో, సమాజంలో, పనిచేసే చోటా, మనకు అనుకూలం కాని పరిస్థితులు చాలా ఎదురవుతాయి. మొహమాటం కొద్దీ అన్నింటికీ అవునంటుంటే మనమీద ఒత్తిడి ఎక్కువవుతుంది!

అవును, కాదు అంటూ మన స్వంత భావాలను చెప్పగల స్వతంత్రం మనకుంది.

- అప్పుడే మన హక్కులు మనకు మిగులుతాయి.
- మన భావాలు పదిమందికీ తెలుస్తాయి.
- మన అవసరాలు మనకు అందే వీలు కలుగుతుంది.
- మన దృక్పథం అందరికీ అర్థమవుతుంది.

మన సినిమా కథల తీరు ఒక్కసారి మనసులో విశ్లేషించి చూడండి. నిత్య జీవితంలో మనం గురవుతున్న ఒత్తిడికి కారణాలను వెదికి చూడండి. చెప్పవలసిన ఒక్క విషయాన్ని చెప్పకపోవడంవల్ల అంత కథ నడుస్తుంది. ఇంత అసౌకర్యం కలుగుతుంది.

కాబట్టి, చెప్పవలసిన విషయాన్ని వినయంగానే చెప్పగలగాలి.

మీకు ఇప్పటికే ఆఫీసులో పని ఎక్కువయింది. బాగా పనిచేసే వారికే మరింత పని చెపుతారన్నది అందరికీ తెలిసిన సంగతే. మీకూ అదే జరిగింది. మరింత పని తలమీద వేశారు. మంచితనం పేరిట, ఆ భారాన్ని కూడా తలకెత్తుకుని సతమతమవుతారా? అలా చేస్తే ఏ పనినీ సక్రమంగా చేయలేకపోతారేమో?

మీకు తీపి తినడం ఇష్టంలేదు. వాళ్లేమో అదేపనిగా తీపి వడ్డిస్తున్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ మీరు మీ మనసును గౌరవంగా బయటపెట్టగలగాలి. అందులో ఏరకమయిన అపరాధభావన అవసరంలేదు. అవతలివాళ్లు ఏమను కుంటారోనన్న అనుమానం అవసరంలేదు! ఏమో? అర్థం చేసుకుంటారేమో? ఆ అవకాశం కూడా ఉందిగదా?

- మీ నిర్ణయాలు మీరు నిర్మొహమాటంగా చేయండి.
- మీ దగ్గర పనిచేసే వారికీ, పిల్లలకూ నిజం చెప్పడం అవసరం.
- పై అధికారులకు పెద్దలకూ మీ మనసు విప్పి చెప్పండి.
- మీతోపాటు పనిచేసే వారికీ మీ మనసు తెలిస్తే మంచిది.
- మీ సాయం కోరి వచ్చేవారితో మొహమాటం పెట్టుకోవద్దు!

మిత్రులు, కుటుంబంలోని వారితో కూడా అసలయిన భావాలను తేల్చి చెప్పగలగాలి! మనుషులందరిలోను మంచి ఉంది. ఆ మంచి పెంచే అవకాశాలను మనం చేజేతులా వదులు కోకూడదు.



# అనుసరించకండి

మాటయినా, మరొకటయినా, మనం ప్రతి విషయాన్నీ మరొకరిని గమనించి నేర్చుకుంటాము. యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవ ఇతరో జనా: అన్నది గీత వాక్యం. అంటే గొప్పవారు ఏ మార్గంలో వెళితే, మిగతా వారంతా అదే దారిని వెళతారు అని అర్థం! కానీ, మనముందు దారితీస్తున్న వారంతా, గొప్ప వాళ్ళనే నమ్మకం ఉందా? లేదు గనుకనే సూక్తి కూడా మారింది. గతానుగతికో లోక: అని కొత్త మాట. దీనికి తెలుగు చెప్పాలంటే గొర్రెదాటు అన్న ఒక్క మాట చాలు. గొర్రెలకు గొప్ప తెలివి ఉండవలసిన అవసరం లేదు. కానీ గుంపు వెళుతూ ఉంటే, దారికి ఏదో ఒక అడ్డు వస్తుంది. అప్పుడు యజమాని వచ్చి అదిలిస్తే, ముందున్న ఒక గొర్రె, అడ్డుమీదనుంచి ముందుకు దూకుతుంది. అంతే! తరువాత ఒకదాని వెంట మరొకటి అన్ని గొర్రెలూ దూకుతాయి, అడ్డు తొలగినా సరే, అవి అలా దూకుతూనే పోతుంటాయి.

వింత ఏమిటంటే అనుసరించడమన్న విషయానికి వచ్చేసరికి, తెలివిగల మనిషికి, తెలివిలేని గొర్రెలకూ అంత తేడా కనిపించదు! ఎందుకు చేస్తున్నారు ఈ పని! అనే ప్రశ్నకు మామూలుగా జవాబు అందరూ చేస్తున్నారు గనుక! అని వస్తుంది. ఇందుకు ఎన్ని ఉదాహరణలయినా మీరే ఊహించుకోవచ్చు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఒకసారి ఒక క్రాస్ కంట్రీ రేస్ జరిగింది. పరుగు మొత్తం ఏడు మైళ్లదూరం జరగాలి. పరుగు మొదలయింది. రెండు గంటల తర్వాత, ముందు నిర్ణయించిన మార్గంలో ఒక్క పురుగు (పరుగు తీసే వ్యక్తి!) కనిపించలేదు.

ఏమి జరిగింది? ఏదో జరిగిందని అర్థమవుతూనే ఉంది. అధికారులు వెంటనే కారుల్లో వస్తుంటారు గనుక సంగతిని సులభంగానే అర్థం చేసుకోగలిగారు. పోటీ దారులందరూ దీక్షగా, మరెక్కడో పరుగు పెడుతున్నారు. నిజానికి పరుగు ముగియ వలసిందన్న సంగతి కూడా పట్టకుండా వారంతా పరుగుతీస్తున్నారు. అందరికన్నా ముందు పరుగెత్తుతున్న వ్యక్తి, ఒకచోట, తప్పుదారి మళ్లాడు. అందరూ అతని వెంటే, తప్పుదారిలో పరుగెత్తారు! మామూలు మనిషి తన జీవితకాలంలో కనీసం పదివేలమందిని ప్రభావితులను చేయగలడని పరిశోధకులు జాన్ మాక్స్‌వెల్ అంటున్నారు. ఇక నాయకులుగా వారు మరింత ఎక్కువ మందిని ప్రభావితులను

చేస్తారు. నాయకత్వం రాజకీయంలోనే కానవసరం లేదు. చిన్నపిల్లలలోనూ స్వతహాగా 'రా! చూపిస్తా!' అనగలిగిన నాయకులుంటారు! అందుకే నాయకులుగా ముందుకు సాగుతున్నా, అనుసరించే వారుగా మరొకరి వెంట వెళుతున్నా మనం సరయిన దారిలో వెళుతున్నామా? అని ప్రశ్నించుకోవలసిన అవసరం ఎంతో ఉంది! సరయిన దారిని గుర్తించవలసిన అవసరం అంతకన్నా ఎక్కువగా ఉంది! మనం ఒక నిర్ణయం చేస్తే, అది ప్రత్యక్షంగా, పరోక్షంగా, మనల్నేగాక మరెందరినో ప్రభావితులను చేస్తుంది. సరయిన మనుషులు సరయిన నిర్ణయాలు చేస్తే, అందరికీ బాగుంటుంది! సరయిన నిర్ణయాలు చేయడం అలవాటుగా మారాలి మరి.

ముందువారితో సమంగా పోతే చాలు! అనుకున్నంత కాలం గుంపులో ఒకరిగా ఉండిపోవలసిందే.

## మరొకరితో... మరికొందరితో...

ఇంట్లోగానీ, సంఘంలోగానీ, చదువులోగానీ, ఉద్యోగంలో గానీ, ఎటువెళ్లినా మనకు మనుషులు ఎదురవుతారు. బాగా బతకడమంటే, ఈ మనుషులతో కలిసి బాగా బతకడమని అర్థం చేసుకోవాలి. బాగా బతకడానికి ఎన్నో మార్గాలున్నాయి. వాటిలో కొన్ని...!

మనమొకచోటికి వెళితే అబ్బా! ఎందుకువచ్చాడూ! అనిపించుకోకుంటే మంచిది. అందరితోనూ కలుపుగోలుగా ఉండడం ఎంతో అవసరం. ఇది అనుకున్నంత సులభంగా వీలయేది కాదు.

ప్రతి సంఘటనకూ, మాటకూ ఎక్కువగా చలించకూడదు. వెంటనే ప్రతిచర్యనూ, ప్రభావాన్ని చూపకుండా ఉండగలిగితే మంచిది. చిన్న చిన్న విషయాలను అసలు పట్టించుకోకుండా ఉండగలిగితే మేలు!

మనకు అందరిలోనూ నిజమైన ఆసక్తి ఉందన్న భావాన్ని, నడవడినీ అలవాటు చేసుకోవాలి. అందరిపేర్లనూ గుర్తుంచుకుంటే ఎంతో మంచిది. అరుదుగా కలిసే వారినయినా, పేరు గుర్తుంచుకుని పలకరించి చూడండి. ప్రభావం ఎలాగుంటుందో మీరే గమనించవచ్చు.

అందరికీ మనలోనూ ఆసక్తి కలిగేలా ప్రవర్తించడం ఒక కళ. అది పట్టుబడిందంటే, ఎదుటివారిని మనవారుగా మార్చుకోవడం సులభమవుతుంది.

ఇలాంటి సూత్రాలు ఎన్నో ఉన్నాయి. వీటిని గురించి చెప్పడం సులభం

అనుసరించడం అంత సులభం కాదు. కష్టం మాత్రం అంతకన్నా కాదు!

### అది మీ చేతుల్లో ఉంది

ఇద్దరు కుర్రవాళ్లు ముల్లా నస్రుద్దీన్‌ను ఆట పట్టించాలని పథకం వేశారు. వాళ్లు ఒక చిన్న పురుగును పట్టుకున్నారు. రెండు చేతులను పురుగుచుట్టూ గుండ్రంగా పెట్టి ముల్లా దగ్గరకు తీసుకెళ్లారు. 'పురుగు బతికి ఉందా? చచ్చిందా?' అని అడిగారు. అతను చెప్పిన జవాబును అబద్ధం చేయడం సులభమే. చచ్చింది అంటే పురుగును వదిలేయాలి. బతికి ఉంది అంటే, అదిమి చంపి చూపాలి! అది వారి పథకం.

ముల్లా దగ్గరికి వెళ్లి, ప్రశ్న అడిగారు.

ఈ చేతుల్లో ఉన్న పురుగు చచ్చిందా? బతికి ఉందా? అని.

'ఆ సంగతి మీ చేతుల్లో ఉంది!' అన్నాడు ముల్లా!

## ఇంటర్వ్యూలో...

కమిటీవాళ్లు మనకు శత్రువులు కారు. మనలోనుంచి తగినవారికోసం వాళ్లు వెదుకుతున్నారు. మీరు వెదుకుతున్న మనిషిని నేనే! అని వారిని నమ్మించడం మనవంతు. ఆ పని చేయగలిగితే, అన్ని ప్రశ్నలకూ సమాధానం ఇవ్వకుండానే మనం ఉద్యోగం చేజిక్కించుకోవచ్చు.

**గమనించండి...**

- ఏం జరుగుతుందని ఊహించకండి. ఊహించనిదాన్ని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండండి.
- హాయిగా రిలాక్స్ అయే ప్రయత్నం చేయండి! నో టెన్షన్స్!
- మీ వేషం, భాషా ముఖ్యం! కానీ అవే ముఖ్యం కావు.
- అతి వినయం మంచిది కాదు. నిజంగా మీరు నమ్ముతున్న సంగతి గురించి (కొంతవరకు) వాదించినా తప్పులేదు.
- తెలియని విషయం, తెలియదనడం మంచిది. తెలియదు అన్న దాకా ప్రశ్నలు వచ్చిపడుతూనే ఉంటాయి.
- తికమకపడవద్దు. అప్పుడే మరిచానన్నట్లు, బుర్రగోక్కోవద్దు.
- వాళ్లు చికాకుపెట్టే ప్రయత్నం చేస్తారు. చికాకు పడవద్దు.
- అనవసరంగా చర్చకు దిగవద్దు.
- మీరూ (సరయిన) ప్రశ్నలు అడగవచ్చు!

ఇంటర్‌వ్యూలను తట్టుకోవడం తెలిసిన తర్వాత, ఇక వాటి అవసరం ఉండదు!

## ముందు చూపుతో అడుగువేయాలి?

- చేసే పనివల్ల పొరపాటు జరిగే అవకాశం ఉందా? వచ్చే ఫలితాలు మనకు అనుకూలంగానే ఉంటాయా? ఆలోచించి అడుగువేయడం ఎంతో అవసరం!
- జీవితం ఒక పరీక్ష అంటారు. ఆ పరీక్షలో వచ్చే ప్రశ్నలివే. జవాబులు తెలిసినవారు విజయమార్గంలో నడుస్తారు.



### నిజమైన చిత్రం

మనిషి తన గురించి తానొక రకంగా ఊహించుకుంటాడు. మిగతావాళ్లు ఆ మనిషి గురించి ఏదో అనుకుంటారు. ఆ మనిషికి అసలు స్వరూపం ఒకటి ఉంటుంది. తాను మరేదో కావాలన్న ప్రయత్నమూ ఉంటుంది. వీటన్నిటినీ కలిపితే, ఆ మనిషి అసలు చిత్రం వస్తుంది.

–డోర్ షారీ



**మనలోనే ఉంది**

*ఒకప్పుడు ప్రపంచంలోని తెలివంతా అందరికీ అందుబాటులో ఉండేదట. అయినా ఎవరూ దాన్ని అంతగా పట్టించుకోలేదు. దేవతలకు ఈ పరిస్థితి నచ్చలేదు. తెలివి నిజంగా కష్టపడి ప్రయత్నించే వారికి మాత్రమే అందుబాటులో ఉండాలని నిర్ణయించారు. అప్పుడయినా తెలివిని బాగా వాడుకుంటారని వారి అభిప్రాయం.*

*మరి తెలివినంతా ఎక్కడ దాచాలి?*

*'నేలలో లోతుగా పాతితే సరి' అన్నారొకరు.*

*'లేదు. మనుషులు తవ్వి తెలుసుకుంటార'ని జవాబు వచ్చింది.*

*'సముద్రం లోతుల్లో దాచవచ్చు'*

*'లేదు అక్కడికీ చేరగలడు మనిషి'*

*'ఎత్తయిన కొండకొమ్మున పెడితే?'*

*'అదీ అందని చోటేమీ*

☞

# ఉత్సాహమే ఊపిరి

ఏది సాధించాలన్నా ముందు మనసులో ఉత్సాహం ఉండాలి. చదువు, ఉద్యోగం, ఆరోగ్యం, పదిమందిలో గుర్తింపు, ప్రజలతో సంబంధాలు, మనం మరింత బాగుపడటం, ఇలా ఎన్నయినా సరే, అన్నింటికీ ఉత్సాహమే ఊపిరి.

ఏదో కావాలనుకుంటాం. బుద్ధిగానే బయలుదేరతాం. సహజంగానే కష్టాలు ఎదురవుతాయి. ఇదంతా కష్టం అనుకుంటాము. ఇదంతా అసాధ్యం అనే చోటికి చేరుకుంటాం. అప్పుడిక ఆ పని పూర్తి చేయడానికి అవసరమయిన ఉత్సాహం, పట్టుదల సడలిపోతాయి. కష్టమయిన పనులన్నీ అసాధ్యాలు కావు. కష్టమయినా సరే సాధించి తీరాలి అన్న పట్టుదల ఉంటే, పరిస్థితి మరోరకంగా ఉంటుంది. అది లేకుంటే మనుసలో ఒక ఖాళీ, ఒక నిస్సహాయత పరుచుకుంటాయి. అందరమూ ఎప్పుడో ఒకప్పుడు ఈ రకమయిన పరిస్థితిని రుచిచూచిన వాళ్లమే!

అలాంటి సందర్భాల్లోనే ఉత్సాహాన్నీ, పట్టుదలనూ మరోసారి పైకెత్తాల్సి ఉంటుంది. అది అన్నంత, అనుకున్నంత సులభంకాదు. ఎలా, జరగాలది? ఎవరు చేయాలా పని? ప్రశ్నలు ఎదురవుతాయి.

ఇంట్లో వాళ్లు, ట్రెయినర్లు, పుస్తకాలు మనకు ఆ ఉత్సాహాన్ని అందించ గలవా? ఎవరో వచ్చి మనకోసం ఏదయినా చేస్తారా?

ఇది జీవితంలో పరీక్ష. అన్ని పరీక్షలలాగే, ఈ పరీక్ష కూడా ఎవరికి వారే ఎదుర్కోవాలి. జయించాలి! మిగతా వాళ్లు ఏదోకొంత సాయం చేస్తారు. పరీక్ష మనవంతు పని! పరీక్ష సమయంలో ఇక నావల్ల అయ్యేట్టు లేదు! అంటున్న నీవు ఒక భాగం. లేదు ముందుకు సాగాలి అనే నీవు రెండో భాగం. ఈ రెండు నీవుల మధ్య పోరాటంలో రెండో నీవు గెలవాలి. అది ఒకసారి జరిగితే చాలదు. అవసరం వచ్చినప్పుడల్లా ఈ యుద్ధం తప్పదు! ఉత్సాహమే గెలవాలి!

1. జీవితానికి ఒక గమ్యం, ఒక దృష్టి, ఒక వ్యూహం అవసరం! నాకు ఏం కావాలి. పరిస్థితులేమిటి?

   ఈ పరిస్థితుల్లో నా గమ్యానికి సరైన త్రోవ ఏది అన్న అంశాలు మనసులో ముందే స్థిరంగా ఉండాలి. వాటిని ఒక కాగితం మీద రాసి పెట్టుకోగలిగితే మరీ బాగుంటుంది.

2. ఎంచుకున్న దారిలో ముందుకు కదలడానికి సరైన ఉత్సాహం అవసరం. గమ్యం ఉండగానే సరిపోదు. ముందు ఆ గమ్యం నాకెందుకు? అన్న ప్రశ్నకు జవాబు తెలిసి ఉండాలి. అది నీకు ఇష్టం గనుకనా? అవసరమా? కేవలం మానసిక ప్రశాంతత కొరకా? గమ్యం చేరిన తర్వాత మనకు ఏమి మిగులుతుంది? ఈ ప్రశ్నలకు జవాబులు తెలిస్తే ఉత్సాహం నిలబడుతుంది.
3. మంచి ప్రయత్నాలు కూడా తప్పదన్నట్లు, అదేపనిగా చేస్తుంటే ఉత్సాహం తగ్గుతుంది. అప్పుడప్పుడు నిలబడి విశ్రాంతిగా ఆలోచించడం మంచిది. అప్పుడు ఉత్సాహం మరింత పెరుగుతుంది.
4. ఫలితాలు అందుతుంటే ఉత్సాహం పెరుగుతుంది. చాలా సందర్భాల్లో ఫలితం కోసం చేసే ప్రయత్నాలే ఎంతో ఉత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణమే నా గమ్యం అని ఒక చక్కని మాట ఉంది.
5. ప్రయత్నించాలని నిశ్చయించడం మనకు అందే తొలి ఫలితం! ఉత్సాహం లేనిదే జీవితం లేదు. జీవితమంటేనే ఉత్సాహం! ఆ ఉత్సాహమే జీవితానికి ఊపిరి.

## భలేవాడు.. బాసు..

అధికారం కలవారికి, దాన్ని అతిగా వాడటం అలవాటవుతుంది. అలాంటి వారి తీరు మిగతా వారందరినీ మానసికంగా, శారీరకంగా కుంగదీస్తుంది. మీరు బాగా పని చేస్తారు. అయినా అనవసరంగా చివాట్లు తింటున్నారు. అవమానాలూ జరుగుతున్నాయి. అక్కడ తప్పు మీది కాదు. బాసులది!

### బాసు తీరు ఒకే లాగుండదు

వారు ఎప్పుడు ఏ మూడ్‌లో ఉంటారో తెలీదు. ఏంచెబితే ఏమంటారో? దేన్ని మెచ్చుకుంటారో? దేనికి అరుస్తారో తెలియదు. నూరు సంగతులు ఆలోచించుకుని వెళితే 101వ ప్రశ్న అడిగే బాసులుంటారు.

### అవమాన పరచడం హాబీ

అందరినీ తప్పులు పట్టడం, అందరిలోనూ అవమానపర్చడం, అదొక రాక్షస ప్రవృత్తి. మంచిపని అని తెలిసి కూడా మెచ్చుకోక పోవడం ఒక రుగ్మత. పైగా ఆ మంచి అంతా తమవల్లనే జరిగిందని ప్రచారం చేసుకునే బాసులూ ఉన్నారు.

### వాళ్ళు గెలవాలి, మిగతావాళ్ళు ఓడాలి

అందరూ గెలిస్తే కొందరు అధికారులకు నచ్చదు. ఎదుటివారు చెబుతున్నదే నిజమనే పరిస్థితి వస్తే దాటవేసే ప్రయత్నాలు చేస్తారు కూడా.

*కాదు!'*

*'ఇదంతా కాదు. మనిషిలోనే ఆ తెలివిని దాచితే సరి. తనలో వెదకాలని మనిషికి తోచదు!' అన్నాడు నిజంగా తెలివిగల దేవుడొకాయన.*

*అలాగే జరిగింది! ఇవాళటికీ అలాగే ఉంది!*

**ఎవరికీ స్ఫూర్తినిచ్చే ప్రసక్తి లేదు:**

ఏం చేస్తారో తెలియదు. ఈ పని అయిపోవాలి! అనేది వారి నుంచి వచ్చే మామూలు మాట! వాళ్ళకే తెలియకపోతే, వారి నుంచి నేర్చుకోవలసిన మనకు తెలిసేది ఎట్లా?

ఆఫీసులో అధికారి పద్ధతి ఇదయితే మనం మన పిల్లలతో, తోటివారితో, బంధువులతో ఇదేరకంగా ఉంటున్నామా? అని ఆలోచించవలసిన అవసరం ఉంది. మనదీ ఇదే పద్ధతి గనుక అయితే, చివరకు మిత్రులు కూడా మిగలరు మరి! అధికారులు మారాలి. మరి మనమూ మారాలా? ఆలోచించాలి గదూ?

## ఆలోచించండి

- మనల్ని మనం మన భావాల ఆధారంగా బేరీజు వేసుకుంటాం. ఎదుటివారిని మాత్రం వారి పనులు, మాటల ఆధారంగా బేరీజు వేస్తాం!
- ఎవరో మన పొరపాటును ఎత్తి చూపుతారు. నిజానికి నేను అలా చేయాలని అనుకోలేదు! ఏదో జరిగిపోయింది! అంటాం. అందరూ అంతేనేమో?
- మార్పును గుర్తిస్తేనే ముందుకు కదలడం సులభమవుతంది. మనం మారకుండా ప్రపంచం మారాలనుకుంటే కుదరదు.



### రాక్షస బలం

*భలే! భలే బాగుంటుంది! రాక్షసుడికున్నంత బలం ఉంటే భలే బాగుంటుంది. కానీ దాన్ని రాక్షసుడిలాగే వాడితే మాత్రం బాగుండదు.*

– షేక్స్‌పియర్

*– అవును! నేను నాపట్ల నేనుగాని, ఇతరుల పట్ల గానీ రాక్షసంగా ఉండను. నాలోని వెలుగే నా బలం. నాగురించి నేను తెలుసుకోవడమే నా ప్రయత్నం.*

• • •

*పని:*

*పని ఎక్కువయిందని బాధపడి లాభం లేదు. పరిస్థితి మరీ దుర్భరమయితే ఆ విషయాన్నీ, పనినీ అర్థం చేసుకునే వారి కోసం వెదకాలి.*

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Batuku+Badi+Yuva+Vikasam+Vyasalu](http://kinige.com/book/Batuku+Badi+Yuva+Vikasam+Vyasalu)**

* * *